# 21.

# వర్తమానంలో జీవించుట శ్రేయస్కరము

పునరపి జననం పునరపి మరణం
పునరపి జననీ జఠరే శయనం
ఇహ సంసారే బహు దుస్తారే
కృపయా పారే పాహి మురారే.

మళ్లీ పుట్టుట మళ్లీ గిట్టుట
అమ్మ కడుపులో అణగియుండుటా
అంతులేని సంసారము దయతో
దాటింపుము నను దబ్బున దేవా ॥భజగోవిందం॥

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా!

జన్మించిన ప్రతి జీవికూడను, స్థూలరూపమును ధరించిన ప్రతి పదార్థము కూడను మార్పుచెందక తప్పదు, గతించక తప్పదు. ఈ జనన మరణములకు మధ్యయందు కొన్ని బాధలు, క్షీణము, నశించటము పరిణామము పొందటము, జీవించటము ఇట్టి షడ్వికారములచేత జీవితమనేది ఈ జనన మరణములకు మధ్య చిక్కుకొని ఉంటుంది. అయితే, పుట్టి గిట్టే ఈ మధ్యకాలమును ఏరకమైన మార్గమునందు మనము ప్రవేశపెట్టి మన జీవితమునకు తగినటువంటి సార్థకము అందుకుంటున్నాము అనే విషయాన్ని ప్రతి మానవుడు విచారించవలసిన విషయము. నిజముగా యిట్టి లోతుగా విచారము చేసినవ్యక్తికి ఒక విధమైన విరక్తికూడను రాకతప్పదు. అట్టి విరక్తి పొందిన మానవుడు యిట్టి రక్తియందు ఒకవిధమైన అసహ్యము కూడను కనిపించి అనుభవించి తాను ఒకవిధమైన భావముతో ఈ రీతిగా పలుకగలడు.

చెడ్డచింత చేసి చేసి గుడ్డియాటలాడి ఆడి
ఊడిపడే దేహానికి బూటకపు ఆటలాడి
ప్రారబ్ధము తీరగానే కపట వేషాల్ విడనాడి

sri sathyasaivachanamrutam

## పుణ్య పాపములతో కూడి మరణింతువు ఓ కిలాడి!

### ఔషధం సేవించటం ఇకముందు ఔషధం సేవించకుండా ఉండుటకోసమే

జననమూ, మరణము, ఈ జననమునకు మరణము, మరణమునకు జననము యిదియేనా దీని అర్థము లేక యింకేమైనా అంతరార్థమున్నదా అని మనము విచారించినప్పుడు, ప్రతి మానవుడు యిట్టి ప్రశ్నలే వేసినప్పుడు, జన్మించినవాడు మరణిస్తాడు, మరణించినవాడు జన్మిస్తాడు. జన్మించటం ఎందుకోసం, మరణించటం ఎందుకోసం అని ప్రశ్న వేసినప్పుడు మరణించటం జన్మించటం కోసం, జన్మించటం మరణించటం కోసం. ఇట్టి జవాబు ప్రతి మానవుడు చెప్పటానికి సంసిద్ధుడై ఉంటాడు. కాని, ఈ జవాబు సరైనదికాదు. ఎవరైనా వ్యక్తిని, 'అయ్యా! నీవు ఔషధం ఎందుకు తీసుకుంటున్నావంటే రోగనివారణ కోసమని చెప్పటం సర్వ సహజం. కాని అది సరైన జవాబుకాదు. "ఔషధము సేవించటం యింక ముందు ఔషధం సేవించకుండా వుండటం కోసం" అనునదే సరైన జవాబు. ఎందుకోసం జన్మించినావంటే యింకపైన జన్మించకుండా ఉండటం కోసం జన్మించినానని చెప్పటం సరైన జవాబు. మరణించటం జన్మించటంకోసమని, జన్మించటం మరణించటం కోసమని ఈ కాలచక్రమును జనన మరణములలోనే వ్యర్థము చేసుకోవడం కంటే, నిజమైన సార్థకమైన సత్యస్వరూపాన్ని గుర్తించటం మానవుని యొక్క కర్తవ్యము. అయితే, దేహమే లేకపోతే ఈ జగత్తునందు ఎట్టి కార్యమును చేయటానికి వీలుకాదు. స్థూలరూపమైన దేహము జగత్తుకు అవసరమే. అయితే, దీనిని మనం ఉపాధిగా తీసుకుని తద్వారా సాధించవలసిన లక్ష్యము లోపల దీనిని ప్రవేశపెట్టటం సామాన్యమైన మానవుని కర్తవ్యం.

### ఎన్నో జన్మల పుణ్యఫలం ఈ మానవ జన్మ

ఈ దేహము బంధనకు ఎంత కారణమో, మోక్షమునకు కూడా అంత కారణమే. "మనయేవ మనుష్యానాం కారణం బంధమోక్షయోః" అంటున్నారు. కాదు, దేహముకూడను బంధ మోక్షములకు కారణముగా ఉంటున్నది. దేహమే లేక మనస్సు తత్త్వాన్ని గుర్తించటం సాధ్యం కాదు. ప్రాణము, మనస్సు, బుద్ధి, చిత్తము ఈ యింద్రియములన్ని కూడను దేహమును పురస్కరించుకొనియే ఈ జగత్తునందు ప్రకటనమవుతున్నది. కనుక, అట్టి

srisathyasaivachanamrutam

పవిత్రమైన దేహమును సార్థకమైన మార్గమందు ప్రవేశపెట్టి సత్యాన్వేషణయందు మన జీవితమును అంకితముచేసి నిత్యకృత్య కర్మ నిర్బంధ జీవితముకోసము కర్తవ్య కర్మలను ఆచరించుటకు జంతూనాం నరజన్మ దుర్లభం. ఎన్ని జన్మముల యొక్క పుణ్యఫలము చేతనో ఈ మానవజన్మ ప్రాప్తిస్తుంది. అట్టి ప్రాప్తించిన మానవజన్మమును సార్థకమొనరించుకునే మార్గములో ప్రవేశపెట్టాలి. దీనిని గురించియే శంకరుల శిష్యులు "పునరపి జననం, పునరపి మరణం" అన్నారు. అయ్యా పుట్టటము, చావటము, తల్లి గర్భములోపల ఆ పిండము ఆ స్వరూపాన్ని ధరించ టానికి పడేటువంటి కష్టములు అలవికానివి. మీకు ఆ స్థితి తెలియదు. నిజముగా పిండము రూపముగా మారే సమయములోపల నరక వేదన అనుభవిస్తుంది. యిలాంటి దేహము ఇంత కష్టపడి, ఇన్ని శ్రమలకోర్చి జగత్తును కండ్లారా చూచిన ఈ దేహము పవిత్రమైన మార్గాన్ని ప్రవేశింపకుండా, అపవిత్రం చేసుకోవటము నిజముగా మానవత్వమునకే చాలా అవమానకరంగా ఉంటుంది. ప్రతిమానవుడు జగత్తులోపల ఒక ఆదర్శాన్ని నిరూపణచేసే యొక్క దివ్యకార్య నిమిత్తంగా వచ్చినాడు. జగత్తు అనే పెద్ద మిషనులోపల ఒక్కొక్క పార్టు వంటివాడు. ఒక స్క్రూ, ఒక బోల్టు, ఒక నట్ ఏదో ఒకవిధముగా ఈ జగత్తు అనే కర్మాగారములోపల ప్రతి మానవుడు కూడను ఒక అంగముగా ఉంటున్నాడు. మన లక్ష్యమునందు ఏదోమన జీవితము వ్యర్థమైనటువంటిది, చిన్న పిన్ను వంటిది అని మనం అనుకుంటాం. కాని, ఆ చిన్న పిన్ను లోపలనే ఉంటున్నాది మిషను యొక్క లైఫంతా. దీనికి ఒక చిన్న ఉదాహరణము. పెద్ద ట్రైను బయలు దేరి చాలా స్పీడుగా పోతుంటుంది. కాని, దానిని నిల్పాలని లక్షలమంది ప్రజలు వెళ్లి పట్టుకొన్నప్పటికిని వారికే ప్రమాదము నందిస్తుందిగాని ట్రైను నిలవటానికి పూనుకోదు. కాని ఇంజను రూములోనున్న డ్రైవరు బ్రేక్ అనే చిన్న పిన్నును వేసేటప్పటికి ట్రైను ఆగిపోతుంది. ఇంత వేగముగా పరుగెత్తే పెద్ద ట్రైను లక్షల మంది పట్టుకుని నిల్పలేకపోయినప్పటికి ఆ చిన్న పిన్ను ద్వారా ఆగింది. మానవుని మనస్సులో మంచి భావముల ద్వారా ఈ జగత్తుయొక్క దుర్మార్గమును, అన్యాయమును, అక్రమమును, అనాచారమును, అసత్యమును నిల్పివేసే శక్తి కలదు. చెప్పటానికి సాధ్యము కాదు. కనుక ప్రతి వ్యక్తి కూడను ఉపయోగకరమైనటువంటి యొక్క జగత్కల్యాణము ఆశించే శక్తిగా భావించు కోవటం ఉత్తమమైన లక్షణము. ఈ దేహమునుండి ప్రాణము పోయే పరిస్థితికి మనము ఏమాత్రము

sri sathyasai vahini

వెఱువనక్కరలేదు. ఇది సహజమైన భౌతిక దేహమునకు సంభవించే సామాన్యమైన ధర్మము. నిజముగ ఈ జగత్తులో ఉండటమే ఆశ్చర్యము. దీనికి చిన్న ఉదాహరణము. ఒక సైకిలు టైరు వుంటుంది లేక కారు టైరు వుంటుంది. దానికి ఒక చిన్న పిన్ను గుచ్చుకుందంటే అందులోని గాలంతా వెళ్లిపోతుంది. అంత చిన్నపిన్ను గుచ్చుకుంటే దానిలోనున్న గాలి అంతా కోల్పోతున్న సమయమునందు ఈ దేహమైన టైర్‌కు 9 విధములైన పంక్చర్స్ ఉంటున్నాయి. ఈ గాలిపోవటం లేదు. అందరూ ఆశ్చర్యపడాలి. కనుక, మన జీవితములో యింత కాలాన్ని మన దేహమును నిలబెట్టినందుకు తగిన కృతజ్ఞతను అందించటానికి పవిత్రమైన కార్యములలో మన కాయమును ప్రవేశపెట్టాలి. ఆ దేహమునందు ఉచ్ఛ్వాస నిశ్వాస స్వరూపుడైన హంస గాయత్రి స్మరించే ఆ గాయత్రి యొక్క తత్త్వాన్ని అర్థం చేసుకోవటానికి పూనుకోవాలి. కనుక, సర్వత్రా భగవత్స్వరూపమే. సర్వత్రా భగవశ్శక్తియే. ఇక మనము దేహమును మాత్రమే లక్ష్యమునందుంచుకొని, దేహమే నాయొక్క ఆధారమని, ఈ జగత్తునకు ప్రధానమని అనుకోవటం లక్షణము కాదు. దేహమును ఒక ఉపాధిగా భావించి దివ్యత్వమైన ఆత్మతత్త్వమునే మన లక్ష్యమునందుంచుకొని సర్వత్రా ఆనందమునే అనుభవించుకోవటానికి అవకాశము ఉంటుంది. కొన్ని నిముషములకు పూర్వము పాగే చెప్పాడు "ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్" అని. ఈ ఉపనిషత్ వాక్యము చూచేది నీ కన్నులు కాదు, భగవంతుడే తనయొక్క కన్నులతో దీనిని చూపిస్తున్నాడని చెపుతున్నది. కనుక, నీ కన్నులతో నీవు చూస్తున్నానని భ్రమిస్తున్నావు. కాదు దైవము యొక్క కన్నులతోనే నీవు చూస్తున్నావు. కానీ, సర్వము భగవన్మయమైన ఈ జగత్తునందు ఈ అనిత్యము, అశాశ్వతము, అసత్యము అయినటువంటి నీటి బుడగవంటి ఈ దేహ నిమిత్తమై మనము పరితపించనక్కరలేదు. దేహము నిమిత్తమా మనము పరితపించవలసినది. ఇది మనుష్యుల లక్షణము కాదని మరొక కవి భావోద్రేకముతో చెప్పాడు.

**పుట్టినప్పుడు ఏడ్చినావు, చచ్చునపుడు ఏడ్చుతావు**
**మధ్యన ఎన్నింటికో ఏడ్చుతావు, ధర్మగ్లాని కలుగుచుండ**
**ఉద్ధరింప ఏడ్చినావా? నీ సత్యస్వరూపము దర్శించుటకు ఏడ్చినావా?**
**ఎందుకోసం ఏడ్చినావు? ఏడ్పుకోసం ఏడ్చినావా?!**

srisathyasaivachanamrutam

అని హృదయాన్ని చక్కగా ప్రశ్నిస్తాడు. కనుక, ఈ జగత్తును పరిపాలించే దివ్యస్వరూపుడైన దైవ పరిపాలనయందు మనము ఒక అణువుగా వుంటున్నాము. ఈ దైవ పరిపాలనలో మన భాగమునకు వచ్చిన కర్మను కూడను మనము సక్రమమైన మార్గములో వినియోగించుకోవాలనే సద్భావమును మన హృదయములో నింపుకోవటానికి పూనుకోవాలి. మనము ఇంద్రియములను నిగ్రహించుకోటానికి తగిన ప్రయత్నములు సల్పాలిగాని కేవలము దేహమును మాత్రమే అరికట్టుకోవటానికి ప్రయత్నము చేస్తే ప్రయోజనం లేదు.

**పుట్ట మీద మర్ధించిన పాము మరణమొందునా**
**తనువును తా దండించిన విషయభోగములణగునా**
**ఆకలిదప్పులు మానినంత ఆత్మజ్ఞాని తానగునా**
**తానెవరో తెలియకున్న తత్వజ్ఞాన మెటుకుదురు!**

### వర్తమానం ప్రధానం

కనుక, మొట్టమొదట తానెవరో తెలుసుకోవటానికి ప్రయత్నం చేయాలి. అది తెలియనంత వరకు మనము ఎన్ని కార్యములు చేసినప్పటికిని, ఎన్ని రకములైన సాధనలు సల్పినప్పటికిని మనకు ఈ ఆత్మతత్త్వమనేది అర్థము కాదు. అందువలననే, పెద్దలైన వారిని, అనుభవజ్ఞులైనవారిని కూడి, చేరి వారియొక్క ఉపదేశములను మనము ఆచరణయందుంచి తద్వారా మనము కొన్ని రకములుగా స్వశక్తితో కొన్ని సాధనలు చేకూర్చుకున్నప్పుడు దీనిద్వారా కొంత అర్థము కావటానికి అవకాశము ఉంటుంది. కాని, మీ అదృష్టవశాత్తు మీరు అనుభవజ్ఞుల దగ్గరకు వెళ్లటానికి బదులు యిక్కడికే అనుభవజ్ఞులైన పెద్దలు, అన్ని విధముల విద్యను ఆర్జించిన పెద్దలు, అనుభవజ్ఞులు నిత్యము వారియొక్క ప్రబోధలు, పవిత్రమైన టీచింగ్స్ మీకు అందిస్తున్నారు. మీ అదృష్టవశాత్తు మీరు దీనిని ఆచరణయందు పెట్టి ఈ నెలలో మీరు అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయుటచేత భారతదేశమునకు ఎంతయో ఉపకారము చేసిన వారౌతారు. దీనికి ఒక చిన్న కథ. వచ్చిన వారిని అందరిని ఒక రాజు మూడు ప్రశ్నలు వేసేవాడు. మొదటి ప్రశ్న ఎవరు శ్రేష్ఠుడు? రెండవది ఎట్టి కాలము శ్రేష్ఠమైన కాలము? మూడవది ఏ కార్యము శ్రేష్ఠమైన కార్యము? అని ఈ మూడింటిని తాను తెలుసుకోవటానికి చాలా పరితపిస్తూ ఉండేవాడు. ఎంతమంది ఎన్ని రకములైన జవాబులు

sri sathyasaivachanamrutam

చేసినప్పటికిని ఆ రాజుకు సంతృప్తి కలిగేది కాదు. ఒకనాడు విహారార్థమై అరణ్యమునకు వెళ్లాడు. పర్వతములు, వృక్షములు, కొలనులు పరికించుచూ అలసిపోయి ఒక ఆశ్రమము కనిపించేటప్పుడు ఆ ఆశ్రమము చేరుకున్నాడు. ఈ మహారాజు ఆశ్రమములో చేరేటప్పటికి ఆశ్రమ వాసియైన సాధువు పూలమొక్కలకు నీరు పోస్తున్నాడు. కాని, ఈ రాజు అలసి రావటము గమనించాడు. తక్షణమే తాను పోస్తున్న పాత్రను ఒకచోట పెట్టి ఈ సాధువు పరుగెత్తి వెళ్లి తనకు చల్లటినీరును, తీయటి పండ్లను అందించాడు. ఈ లోపలనే ఒక వ్యక్తికి దేహమంతా గాయములు తగిలి కొంతమంది సాధువులు ఆ వ్యక్తిని ఆ ఆశ్రమానికి తీసుకొని వచ్చారు. ఆ వ్యక్తిని తక్షణమే చక్కని శుద్ధమైన జలముతో గాయములను కడిగి, చెట్టు మూలకముగా ఏర్పరచుకున్న ఔషధములు వేసి ఉపశాంతి నిమిత్తమై చక్కని బోధలు సల్పుతూ అతని దగ్గర కూర్చొని మనశ్శాంతి నిమిత్తమై ఉపదేశమునందిస్తూ వస్తున్నాడు. సాధువు యొక్క చల్లని మాటలచేత అతని బాధలంతా మరచి చక్కగా నిద్రించాడు. తక్షణమే ఈ మహారాజు కాలాతీతమైనది నేను నా గ్రామమునకు వెళ్లివస్తాను' అని సాధువుకు కృతజ్ఞత తెలిపే నిమిత్తమై సాధువు దగ్గరకు వచ్చాడు. సాధువు చక్కగా ఆశీర్వదించి వెళ్లి రావచ్చునని ఆజ్ఞ యిచ్చాడు. కాని, ఈ మహారాజు తనలో మెదలుతున్న యీ మూడు కోరికలు సాధువును ఏమైనా అడుగుతే చెప్పుతాడని అతని దగ్గర ఈ మూడు కోరికలు వెల్లడించాడు. ఈ ప్రశ్నకు జవాబు చెప్పాడు. ఇంతవరకు జరిగిన క్రియలోపల మూడు ప్రశ్నలకు జవాబులు ఉన్నాయి అన్నాడు సాధువు. ఈ మహారాజుకు ఏమాత్రము అర్థము కాలేదు. 'స్వామీ! నేను కొంతవరకు అమాయకుడుగా వుంటున్నాను. యింతవరకు జరిగిన దానిలో ఈ మూడు ప్రశ్నలకు ఏ జవాబులు వుంటున్నవో విశదీకరించి చెప్పాలి' అని ప్రార్థించాడు. నీవు ఆశ్రమానికి వచ్చే సమయమునందు నేను పూలమొక్కలకు నీరు పోస్తున్నాను. అది కర్తవ్యము. కాని అట్టి కర్తవ్యకర్మలు ఆచరించే సమయ మందు నీవు ఆశ్రమానికి వచ్చావు. కనుక వచ్చిన తక్షణమే నా కర్తవ్యమును అక్కడ పెట్టి తిరిగి ఆశ్రమముకు వచ్చిన అతిథి అభ్యాగతులను ఆదరించేది నా ప్రథమ కర్తవ్యము. వచ్చి నీకు తీయనిపండ్లు, చల్లని నీరు యిచ్చాను. నీ శ్రమ తీర్చాను. నిన్ను కొంతవరకు శాంతి పరచే సమయమునందే ఒక వ్యక్తి బాధలతో అక్కడికి చేరాడు. అతని బాధలు నివారించే నిమిత్తమై

sri sathyasai vachanamrutam

నా కర్తవ్యమును అక్కడ నిర్వర్తించాను. కనుక, ఎవ్వరు మన దగ్గరికి వచ్చి సేవను కోరతారో వారు శ్రేష్ఠమైన వ్యక్తి. ఇంక కార్యము ఏమిటి అంటావా? నా కర్తవ్యములోపల యేయే కార్యమునందు నా కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించాలో ఆ కర్తవ్యమును నిర్వర్తించటమే శ్రేష్ఠమైన కర్మ. కాలమునందు ఏది మంచి కాలమంటావా? వర్తమానమే మంచి కాలము, భవిష్యత్తు ఎక్కడో చేరుకొని వుంటున్నాది. కంటికి కనిపించని పరిస్థితిలో ఉంటున్నాది. కానరాని పరిస్థితిలో ఉంటున్నాది. ఇట్టి భవిష్యత్తును విచారించి ప్రయోజనము లేదు. గడచిపోయిన దానిని గురించి విచారిస్తామా అంటే గడచిపోయినది చూచే పంపించాము. దానిని విచారించ నక్కరలేదు. జరుగుతున్నదానికి తగిన భద్రతను మనం తీసుకోవాలి. కర్తవ్యాన్ని మనము చక్కగా నిర్వర్తించటము, ప్రస్తుతకాలమును పవిత్రము చేయటము, మనయొక్క అతిథి అభ్యాగతులను, యింటికి వచ్చిన వారిని మంచి మాటలతో, మంచి పలుకులతో, మంచి గౌరవముతో వారిని ఆదరించటము ఈ మూడే సరైనటువంటివి. మన దగ్గరకు వచ్చినవాడు మంచివాడు. ఎవరైనా సరే. నీవు చేసే కర్తవ్యము ఏదైనా ఫరవాలేదు. కర్తవ్యము ప్రధానమైనది. కనుక నీవు అది మంచిదిగా చూచుకో. వర్తమానము మనము చూచినప్పుడే భవిష్యత్తు మంచిది కలుగుతుంది. ఈ మూడు పవిత్రమైనవని సాధువు జవాబు చెప్పాడు. ఈ యువకులుగా ఉన్న ఈ సమయమునందు, వర్తమానమునందు మీ కర్తవ్యము ఏమిటి? ఒకవైపున తల్లిదండ్రులను ప్రసన్న హృదయులుగా గావించి, విద్యాదశ యందు ఎట్టి ఒడిదుడుకులకు మీరు చేరకుండా ఏ కార్యమునందు మీరు కలిసినారో ఆ కార్యమును సరైన రీతిలో సాధించటానికి మీరు పూనుకోవాలి. ఈ సక్రమమైన రీతిలో సాధించటము సరియైన కర్మ. ఈ కాలమునకు మీరు కొన్ని రకములైన నీతి నిజాయితీలు, అన్ని తత్త్వముల లోపల గుణములు పోషించుకోవటానికి యిది సరైన సమయము. అయితే ఇంక చేయవలసినది ఏది. తల్లిదండ్రులకు తగిన గౌరవమేకాకుండా, వారికి సార్థకనామాన్ని అందించటమే కాకుండా మన భారతదేశము యొక్క భవిష్యత్తును కూడను, సంస్కృతిని కూడను పునరుద్ధరించటానికి తగిన కంకణము కట్టుకోవాలి. కనుక, ఈ డిసిప్లిన్, డివోషన్, డ్యూటీ ఈ మూడింటిని యీ వయస్సులోపల భద్రపరచుకోవాలి. కాలములో ఏది మంచిదంటే, ఈ వయస్సు ఎంత పవిత్రమైనదో చెప్పటానికి వీలుకాదు. ఈ

పవిత్రమైన వయస్సులోపల అపవిత్రమైన మార్గములు మనము త్రొక్కటం చేత జన్మము చాలా అల్లకల్లోలమైన స్థితిలో అల్లాడిపోతుంది. ప్రస్తుతము మీకు తెలియదు కాని భవిష్యతులో ఈవిధమైన జీవితము తిరిగి రమ్మంటే రాదు. ఉన్నటువంటి ఈ కాలమును పవిత్రమొనరించుకునే నిమిత్తము మీ యొక్క గుణములు పరిశుద్ధమైనవిగా పెట్టుకోటానికి లోకమునకు, భారత దేశమునకు మనస్సు, బుద్ధి, దేహము, త్యాగము చేయటానికైనా సంసిద్ధముగా వుండే పరిస్థితికి మీరు సంసిద్ధులు కావాలి. అట్టి పవిత్ర కార్యము నిమిత్తమై వచ్చినదే దేహము కాని కేవలం దేహం పుట్టింది, దేహము పోతుంది అని దేహమును అలక్ష్యము చేయటము తగదు. మానవత్వానికి సరియైన పవిత్రత ఎట్టిదనగా దేహమును కాపాడుకోవాలి. ఎంతవరకు? మన లక్ష్యమును చేరేంతవరకు దేహము భద్రమైనదిగా ఉండాలి. అంతేగాని దేహముపైన లక్ష్యము పెట్టి మన లక్ష్యమును విస్మరించి జీవితాన్ని వ్యర్థము చేసుకోటం సరియైనది కాదు.

**నాలుగు ఋణములు తీర్చుకునే నిమిత్తమై పవిత్రమైన దేహం వచ్చింది**

మంచిచేసినా, చెడ్డచేసినా దేహమును కట్టకడపటికి విసర్జించక తప్పదు. ఎట్టివారి దేహమైనా లోకములోపల అశాశ్వతమే. కాని మనము ఉన్నంతవరకు ఈ దేహమునకు తగిన శాశ్వత కీర్తినందుకోవాలి. కాకి వగుచు కలకాలము తిరుగక, హంసవై క్షణకాలము తిరుగుము. సత్కీర్తితో ఒక ఐదు నిముషాలు మనము జీవించాలి. అపకీర్తితో ఏభై సంవత్సములు జీవించి ప్రయోజనము లేదు, ప్రహ్లాదుడు చెప్పాడు.

**చేతులారంగ శివుని పూజింపడేని**
**నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని**
**దయయు సత్యంబు లోనుగా తలుపడేని**
**కలుగనేటికి తల్లుల కడుపు చేటు!**

కనుక, అట్టి తల్లి గర్భమునుంచి జన్మించిన పుత్రుడు, ఆ తల్లి గర్భము సంతృప్తి పరచే నిమిత్తము కొంతవరకు కృతజ్ఞత చూపాలి. మనయొక్క ఋణములు నాలుగుంటున్నాయి, మాతృఋణము, పితృఋణము, దేవ ఋణము, ఋషి ఋణము. ఈ నాలుగు ఋణములు తీర్చుకొనే నిమిత్తమై ఈ పవిత్రమైన దేహము వచ్చింది. తల్లి ఎంతో కష్టపడి, తన రక్తమును,



sri sathyasai vachanamrutam

తన ఆహారమును సర్వస్వాన్ని కుమారునికి ధారపోస్తుంది. అట్టి తల్లికి కృతజ్ఞత చెప్పాలి. తండ్రి పోషించి, పెద్దచేసి, విద్యాబుద్ధులు చెప్పించి మీకు తగిన సదుపాయములుచేసిన తండ్రికి కృతజ్ఞత చెప్పాలి. ఇట్టి పవిత్రమైన మానవజన్మ రావటము మహర్షుల యొక్క ఆశీర్వాదము కనుక వారికి కృతజ్ఞత చెప్పాలి. అన్నింటికి మూలాధారమైన వాడు దైవము. కనుక దైవమునకు కృతజ్ఞత చెప్పాలి. చిన్న ఉదాహరణము. మన భారతదేశమునందు పశుబలి ఉండేది. భూతబలి అని కూడా ఉండేది. బలి అనగా లోకార్థమునందు చక్కగా విచారణ చేసినప్పుడు దానిని హింసించటము అనుకుంటున్నాము. బలి అనగా సుంకము. ఇప్పుడు ప్రతి మానవుడు కరెంటుకు టాక్సు కడుతున్నాడు. నీటికి టాక్సు కడుతున్నాము, రోడ్డుకు టాక్సు కడుతున్నాము. ఈవిధమైనవి దేనికోసం కడుతున్నామంటే, ఎక్కడో అందుబాటులో లేని కరెంటును మనకు అందుబాటులో తెప్పించినారు కనుక దానికి టాక్సు. ఎక్కడో మనకు అందుబాటు దూరములోనున్న జలమును అందుబాటులోకి తెప్పించినారు కనుక టాక్సు. అదేవిధముగా భూతబలి అంటే దేవతలంతా మనకు పవిత్రమైన మానవత్వాన్ని అభివృద్ధి పరచి, మానవత్వాన్ని అందించి మనలను ఈవిధమైన పవిత్రమైన జన్మములో ప్రవేశపెట్టారు కనుక వారికి అందరాని ఆనందమును, అందరాని సుఖమును పొందరాని స్వర్గతత్త్వమును మనము పొందే నిమిత్తమై మనము చేసే సాధనలంతా భగవంతునికి సుంకముగా చేసుకోవడమును భూతబలి అన్నారు. అనగా దైవమునకు అర్పితము చేయటమే దీనికి సరియైన అర్థము. కనుక, ప్రతి మానవుడు సుఖము, సంతోషము శాంతి ఆనందము కావాలనుకుంటున్నాడు. ఈ ఆనందమునకు మన సాధన టాక్సు. మన సుఖమునకు ప్రార్థన టాక్సు. మన సౌఖ్యానికి మన ధ్యానము టాక్సు. ఇవన్నీ టాక్సు మాదిరి యిచ్చి మనకు అతిదూరములోనున్న సచ్చిదానందము, నిత్యానందము, బ్రహ్మానందము, యోగానందము, పరమానందం, అద్వైతానంద మనేటువంటి ఆనందమును పొందే నిమిత్తమై సత్ప్రవర్తన, సదాలోచన, సచ్చింతన, సద్గుణములు యివన్నీ అతనికి అందించి వాటిని పొందే నిమిత్తమై. కనుక, మనము ఏది కావాలని కోరుతున్నామో దానికి చెల్లించక తప్పదు. కనుక, మనకు ఈ జన్మము వచ్చినందుకు భగవంతునికి మన హృదయపూర్వకమైన శరణాగతినందించి అతని దగ్గరనుంచి పవిత్రమైన ఆనందాన్ని అనుభవించుకునే నిమిత్తమై ఈ యొక్క

sri sathyasai vahamrutam

పవిత్రమార్గములను పెద్దలంతా ఏర్పరచారు. కాని, ఈనాడు భక్తి భక్తి భక్తి అని అంటున్నామే గాని భక్తి అంటే ఏమిటో అర్థము కాని పరిస్థితి లోపల భక్తి అని ఉచ్చరించుకుంటూ కాలము వ్యర్థము చేస్తున్నాము. ఈనాడు నిజమైన భక్తి ఏమనగా కష్టము రానీ, సుఖము రానీ సర్వము నా మంచి నిమిత్తమై ప్రతి ఒక్కటి కూడను భగవంతుని వరప్రసాదమే అనే ఏకత్వానికి మనము సంసిద్ధులై ఉంటుండాలి. మనము ఏమిచేసినా కూడను ఫలితము మన కర్మను అనుసరించియే ఉంటుంది. నీవు ఒక ఆఫీసులో full time work చేస్తే full pay యిస్తారు. కానీ half time work చేస్తే half pay యిస్తారు. ఈనాడు full time devotion లేదు. Part time devotion గా ఉంటున్నాది. నీవు చేసేది part time, అడిగేది full time. ఎట్లా యివ్వటానికి వీలవుతుంది? కనుక యింతో అంతో యిచ్చి మనము full pay అనుగ్రహము కావాలంటే అతను ఇవ్వడు. నీవు పూర్తి హృదయపూర్వకంగా, నా హృదయవాసి నీవు, నీయొక్క తత్త్వము వల్లనే ఈ జీవితము జరుగుతూ ఉన్నది. కదులుతూ ఉంటున్నాది. నా హృదయవాసివి నీవు నా ఆత్మస్వరూపుడవే నీవు. నా సర్వస్వము నీవు అనేరీతిగా సంపూర్ణముగా అర్పితము చేసుకున్నప్పుడు నీయొక్క సంపూర్ణ బాధ్యత తాను తప్పక చూసుకుంటాడు. అందులో ఎట్టి సందేహము లేదు. ఇచ్చి చూడండి. అనుభవించండి.

**(తేదీ 08-06-1973 న బృందావనంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahanamrutam